క్లుప్తంగా

సామాజిక సేవలో ముందుండాలి

డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



బ్యాటరీ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మోమిన్‌పేట: సామాజిక సేవలో యువకులు ముందుండాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మోమిన్‌పేటకు చెందిన విష్ణుకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి సోదరులు తమ తండ్రి మహంత్‌రెడ్డి, తల్లి స్వప్న జ్ఞాపకార్థం గర్భిణులు, వృద్ధుల, వికలాంగుల ఉపయోగార్థం బ్యాటరీ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. గర్భిణులు, వృద్ధులు, వికలాంగులను బస్టాండు నుంచి వారి ఇండ్ల వద్దకు ఈ వాహనం ద్వారా ఉచితంగా తీసుకెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ అరవింద్, లక్ష్మారెడ్డి, సిరాజోద్దీన్, శేఖర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డికి సన్మానం



రాజేష్‌రెడ్డిని సన్మానిస్తున్న బాల్యమిత్రులు

కొడంగల్ రూరల్: వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డికి ఆదివారం పట్టణంలోని బాల్య మిత్రులు ఘనంగా సన్మానం చేశారు. పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో బాల్య మిత్రులు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్రయాదవ్, అరిగె వెంకటరత్నం, శరణ్‌కుమార్, శ్రీనివాసచారి, దయాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మధు, పప్పుడాగా, అచ్చుతా రెడ్డిలు రాజేష్‌రెడ్డికి శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

వాటర్ మెన్‌లకు శిక్షణ

మోమిన్‌పేట: మండల పరిధిలో ఆయా గ్రామాల్లోని వాటర్‌మెన్‌లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టనున్నట్లు అర్‌డబ్ల్యుఎస్ ఏఈ అభిషేక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వాటర్ మెన్‌లకు నాలుగు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్



కౌన్సిలింగ్ ఇస్తున్న నవీన్‌కుమార్

నవాబుపేట: పాత నేరస్తులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, సత్ప్రవర్తనతో మెలగాలని మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన పాత నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాత నేరస్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అలజడులు, బెదిరింపులు, తదితర విషయాల్లో జోక్యం చేసుకోవద్దని సూచించారు.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు

పరిగి: అర్హులైన ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే మహాలక్ష్మీ పథకం కింద రూ.500లకే గ్యాస్ సబ్సిడీ సిలిండర్ల ప్రొసీడింగ్స్‌లను అందజేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ప్రజల సౌలభ్యం కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మొయినాబాద్‌రూరల్: ప్రతి నిత్యం యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అజీజ్‌నగర్ యోగా సెంటర్ చైర్మన్ భారతీ, డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం అజీజ్‌నగర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

పత్తి ముంచింది!



పెద్దేముల్‌లో చేతికొచ్చిన పత్తి



వర్షాలకు తడిసి ఉబ్బిన పత్తి

- వర్షాలకు పాడైన పంట
- లబోదిబో మంటున్న రైతన్నలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

పెద్దేముల్: పత్తి రైతుకు దిగులు తప్పడం లేదు. ఈ పంటను నమ్ముకున్న రైతన్నకు వరుణుడు నట్టేట ముంచేశాడు. పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంట తడిసి పూర్తిగా పాడవుతుందని రైతన్నలు లబోదిబో మంటున్నారు. గంటల తరబడి చినుకులు పడడంతో పత్తి కాయలు మురుగుతున్నాయి. ఉన్న పూతలు మంకరకు రాలి పాడవుతోంది. మండలంలోని పెద్దేముల్, నాగులపల్లి, రుద్రారం, ఇందూరు, మంబాపూర్, కందనెల్లి, మారేపల్లి, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లో 80శాతం పత్తి పంటను అప్పులు తెచ్చి మరీ సాగుచేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో పాడవడంతో రైతన్నలు పెట్టిన పెట్టుబడులు ఎలా చేతికొస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాని స్థితిలో వారు ఉన్నారు. సుమారు 12వేల ఎకారాల్లో పంటలు వేస్తే అందులో 90శాతం పత్తి పంటలపైనే ఆశలు పెట్టుకున్నారు. పంట ఎదుగుతున్న సమయంలో ఈ ఏడాది ఎలాగైనా అప్పులు తీర్చొచ్చని వారి ఆశలు అడియాశలు అయ్యాయి. పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పత్తి కాయలు మురిగి పోవడంతో దిగుబడి వచ్చే నమ్మకం సన్నగిల్లిందని గుండెలు బాదుకుంటున్నారు. ఇప్పటికే గాజీపూర్, పెద్దేముల్, బుద్ధారం, తట్టెపల్లి, పాగులపల్లితో పాటు పలు గ్రామాల్లో పత్తి తీయడం మొదలు పెట్టారు. ఇప్పటి వరకు కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో 30శాతం నుంచి 40శాతం వరకూ పూర్తిగా పాడయ్యాయి. మిగిలిన పత్తి చేతికొస్తుందనుకుంటే ఎడతెరిపిలేని వర్షాలు రైతన్నలను అయోమయానికి గురి చేస్తున్నాయి. కనీసం మద్దతు ధర వస్తుందోరాదోనని దిగులు పడుతున్నారు. ఇప్పటికే ఇందూరు, రుద్రారం, నాగులపల్లి, పెద్దేముల్‌తో పాటు పలు గ్రామాల్లో ఎక్కువ శాతం పాడయ్యాయి. పాడైన పత్తి పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించి తమను ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

భూ బాధితులకు మార్కెట్ ధర చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్ తదితరులు

తాండూరు టౌన్: భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లు, పరిశ్రమలు, కాల్వల నిర్మాణాల పేరుతో సాగులోని రైతుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అరకొర నష్టపరిహారం చెల్లించడం అన్యాయమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎకరాకు మార్కెట్ ధర ఎక్కువగాఉన్నా ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా చెల్లిస్తోందన్నారు. అభివృద్ధి పేరుతో పేదల భూములు తీసుకోవడమే తప్పా, ఏనాడు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల భూములను స్వాధీనం చేసుకోకపోవడం గమనార్హమన్నారు. ఈ ఏడాది జిల్లా మహాసభలను ఈ నెల 19, 20వ తేదీల్లో తాండూరు పట్టణంలో నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో మహబూబ్, జైపాల్, లాలప్ప, బుగ్గప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయ దినోత్సవంలో మార్వాడీ యువమంచ్ సభ్యులు

తాండూరు టౌన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో బాలాజీ మందిర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను, చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులనూ సన్మానించారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు బాల్‌చంద్, మంజు భాషిణి, శోభారాణి, కీర్తిశర్మ, సంగప్ప, శ్రీశైలం గౌడ్‌లను షాలువాకప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా మంచ్ జాతీయ కన్వీనర్ సురేష్ జైన్, రాష్ట్ర అధ్యక్షుడు నేమిచండ్‌లు మాట్లాడారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. రమేష్‌చంద్ర సార్డా, మన్మోహన్ సార్డా, అనిల్ సార్డా, సచిన్ రాఠి, అరుణ్‌సార్డా, సన్నీ అగర్వాల్, రోహిత్ అగర్వాల్, నిహర్ సోమాని, సునీల్ సార్డా పాల్గొన్నారు.

చెయ్యి ఎత్తితే బస్సు ఆపాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య



బస్సును ఆపి సిబ్బందిని నిలదీస్తున్న చంద్రయ్య

పరిగి: చెయ్యి ఎత్తితే బస్సు ఆపేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మల్లయ్యకు అనారోగ్య సమస్య తలెత్తడంతో ఆదివారం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. దీంతో మల్లయ్య తన కుటుంబ సభ్యులతో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ఆస్పత్రి ఎదుట వేచి ఉన్నాడు. అక్కడ ఎన్ని సార్లు చేయి ఎత్తిన బస్సులు నిలపకపోవడంతో వారు ఆవేదనకు గురయ్యారు. దీంతో ఆవైపుగా వెళ్తున్న చంద్రయ్య జరిగిన విషయం తెలుసుకున్నాడు.
వారిని తన కారులో ఎక్కించుకున్నాడు. ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును నస్కల్ గ్రామంలో ఆపీ ఆర్టీసీ సిబ్బందిని నిలదీశారు. ఎందుకు బస్సులు ఆపడం లేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెయ్యి ఎత్తితే బస్సులు ఆపాలని డీఎంకు ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. ఐనప్పటికీ బస్సు ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులు చెయ్యి ఎత్తితే బస్సు ఆపేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని తను ఆర్టీసీ ఎండీ సజ్జనర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

తొర్మామిడిలో క్రికెట్ టోర్నమెంట్

బంట్వారం: మండల పరిధిలోని తొర్మామిడిలో రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 10న ప్రారంభమవుతుందని టోర్నమెంట్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 50వేలు, రెండో బహుమతి రూ.20వేలు నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.2వేలు ఎంట్రీ ఫీజు చెల్లించి 9-10 తేదీ వరకు తమ టీంల పేర్లను నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. పూర్తి వివరాలకు 7989421262, 970519955, 8919260782, 8919781796 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థికి అభినందన

చేవెళ్ల: ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించిన పారిశుద్ధ్య కార్మికుడి కూతురు హిందూను అంబేడ్కర్ సంఘం అధ్వర్యంలో బురాన్ ప్రభాకర్ ఘనంగా సన్మానించి, రూ. 10వేలు ప్రోత్సాహక సాయం అందించారు. ఆదివారం చేవెళ్లలోని పారిశుద్ధ్య కార్మికుడు సాయన్న ఇంటికి వెళ్లి ఆయన కూతురు హిందూను ప్రత్యేకంగా అభినందించి అంబ్కేర్ ఫొటోను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డుకాదని హిందు నిరూపించిందని, ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. హిందు ఒక్కతే కాదు సాయన్న సుజాత దంపతులకు పుట్టిన ముగ్గురు పిల్లలు ఉన్నత చదువులతో సరస్వతీ పుత్రులుగా నిలవడం సంతోషకరమన్నారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు

పట్టించుకోని అధికారులు

కుల్కచర్ల: మిషన్ భగీరథ నీరు రోడ్డుపై వృథాగా పారుతుంది. చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గ్రామానికి వెళ్లే రహదారిపై మిషన్ భగీరథ నీరు 30రోజుల నుంచి రోడ్డుపై పారడంతో అక్కడ పెద్ద గుంత ఏర్పడింది. ఈ సందర్భంగా ఆవైపుగా వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌడాపూర్ మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నర్సింలు సమస్యను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లే దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



లింగంపల్లి గ్రామ సమీపంలో వృథాగా పారుతున్న నీరు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన ఆయా మండపాల్లో దుర్గామాత పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాలుగోరోజు అమ్మవారికి అష్టోత్తరం నిర్వహించారు. రాజకీయనాయకులు, అధికారులు ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: పాంబండపై అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



ధారూరు: కేరెళ్లిలో అమ్మవారికి అష్టోత్తరం నిర్వహిస్తున్న పూజారి



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



దుద్యాల్: హస్నాబాద్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



తాండూరు రూరల్: అంతారం తండాలో పూజలు చేస్తున్న భక్తులు



కొడంగల్ రూరల్: అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు



తాండూరు టౌన్: అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

ఎమ్మెల్యే నివాసంలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మతో ఎమ్మెల్యే సతీమణి ఉమారెడ్డి, మహిళలు తదితరులు

పరిగి: ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పరిగి పట్టణ, పరిసర గ్రామ మహిళలు, ప్రజలతో కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఒకచోట ఉంచి ఎమ్మెల్యే సతీమణి ఉమారెడ్డి మహిళలు, యువతులు, చిన్నారులతో కలిసి నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దారూరు: ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



యాలాల: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



దోమ: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యాలాల: మండలంలోని పగిడియాల ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఆదివారం అదే పాఠశాలలో సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో స్థిరపడిన వారు తమ యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజుల్ని, అల్లరిపనులను అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులకు పూలమాల వేసి, శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, బాలరాజ్, రఘురాంరెడ్డి, అబ్దుల్ జావీద్, అఫ్జల్, శివారెడ్డి, సర్వర్, అనంతరాములు, మలక్రయ్య, వెంకట్‌రెడ్డి, హరికృష్ణ, శేఖర్, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

కుక్కిందలో...

ధారూరు: ధారూరు మండలంలోని కుక్కింద ఉన్నత పాఠశాలలో 2002-06 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయసమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం విద్య బోధించిన అప్పటి ఉపాధ్యాయులను శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తుకు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు జయప్రకాశ్, అంజిలయ్య, రాజవర్ధన్‌రెడి, సంపత్‌కుమార్, లావణ్య, రాజ్యలక్ష్మీ, శ్రీనివాస్ రెడ్డి, మహాత్మగాంధీ, విద్యాసాగర్, దత్తురావ్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్ హాజరై పూర్వ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

పెద్దేముల్: పెద్దేముల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. అనంతరం వారికి విద్య నేర్పిన గురువులు గాలయ్య, సుభాన్‌రెడ్డి, వెంకట్ కిషన్‌రావు, ఆనంద్‌కుమార్, ఆనంద్‌రెడ్డి, సంధ్యారాణి, జగదాంబ, సులోచనలను శాలువకప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మాజీ సర్పంచ్ కిషన్‌రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దోమ: బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 2009-10 బ్యాచ్ విద్యార్థులు 14 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులు రహమాన్, పాండు, వెంకటయ్య, వీరేశం, రమాదేవి, పద్మ, నర్సమ్మ హాజరయ్యారు.



దుద్యాల్: ఆత్మీయ సమ్మేళనంలో 2002-2003 బ్యాచ్ విద్యార్థులు



పెద్దేముల్: పూర్వ విద్యార్థులు (1997-98 బ్యాచ్)